## న్యాయవాది వెంకటేశ్వర్లుకు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి నివాళి



చివ్వెంల: వెంకటేశ్వర్లు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

చివ్వెంల, మార్చి 6: ప్రముఖ న్యాయవాది జటంగి వెంకటేశ్వర్లు మృతి బాధాకరమని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంట కండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని వట్టిఖమ్మంపహాడ్ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులను జగదీశ్‌రెడ్డి గురువారం పరామర్శించారు. అనంతరం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. వెంకటేశ్వర్లు న్యాయవాదిగా, గ్రామ సర్పంచుగా అనేక సేవలు అందించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో న్యాయవాది డపుకు మల్లయ్య, సూర్యాపేట మాజీ జడ్పీటీసీ జీడి భిక్షం, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు రావిచెట్టు సత్యం, గొడ్డేటి సైదులు పాల్గొన్నారు.

### లింగమంతుల స్వామి పండుగ ఏర్పాట్ల పరిశీలన..

నాగారం: మండల కేంద్రంలో ఈ నెల 23, 24 తేదీల్లో జరుగనున్న లింగమంతుల స్వామి పండుగ సందర్భంగా యాదవ కుల పెద్దల ఆహ్వానం మేరకు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి గురువారం రాత్రి లింగమంతులస్వామి దేవస్థానాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లను పరిశీలించి అన్ని విధాలా సహకరిస్తామని హామీ ఇచ్చారు.

### నాయకుల జన్మదిన వేడుకల్లో..

సూర్యాపేట టౌన్/హుజూర్‌నగర్ రూరల్: జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్ జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. హుజూర్‌నగర్ మండలంలోని అమరవరం గ్రామానికి చెందిన మాజీ జడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి జన్మదిన వేడుకలను సూర్యాపేటలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జగదీశ్‌రెడ్డి సమక్షంలో ఘనంగా నిర్వహించారు.

## లక్ష్మయ్యకు మాజీ ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్ నివాళి

లక్ష్మయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

చిలుకూరు, మార్చి 6: సీనియర్ కబడ్డీ క్రీడాకారుడు కొడారు లక్ష్మయ్య మరణం బాధాకరమని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. మండల కేంద్రం చిలుకూరులో ఇటీవల మరణించిన కొడారు లక్ష్మయ్య కుటుంబాన్ని గురువారం ఆయన పరామర్శించారు. అనంతరం లక్ష్మయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ నాయకులు అల్సకాని జనార్ధన్, తాళ్లూరి శ్రీను, జానిమియా, మాధవరపు శ్రీను, లింగరాజు, పాషా, ఉపేందర్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల డిప్యుటేషన్ సరికాదు : ఏఐవైఎఫ్

గరిడేపల్లి, మార్చి 6: మండలంలోని గానుగబండ ప్రాథమిక పాఠశాల టీచర్లను డిప్యుటేషన్ల పేరుతో ఇతర పాఠశాలలకు పంపించడం సరికాదని ఏఐవైఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు పంగ సైదులు, లింగరాజు అన్నారు. గురువారం వారు పాఠశాలను సందర్శించి మాట్లాడారు. ఉపాధ్యాయులను మరో పాఠశాలకు పంపితే ఇక్కడి విద్యార్థుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. డిప్యుటేషన్‌పై పంపిన ఉపాధ్యాయులను తిరిగి గానుగబండ పాఠశాలకు పంపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు మస్తాన్ అలీ, నందిపాటి సతీశ్, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

### ఎంఈఓ చత్రునాయక్ వివరణ..

గానుగబండ ప్రాథమిక పాఠశాలలో 36 మంది విద్యార్థులకు నలుగురు టీచర్లు ఉన్నారు. తాళ్లమల్కాపురం అప్పర్ ప్రైమర్ స్కూల్‌లో ఉపాధ్యాయుల కొరత ఉండడంతో ఒక టీచర్‌ను తాత్కాలిక సర్దుబాటుపై పంపించాం.

## ఉండ్రుగొండ గుట్టల్లో మంటలు

మంటలను పరిశీలిస్తున్న అటవీ, అగ్నిమాపక శాఖ అధికారులు

చివ్వెంల, మార్చి 6: మండలంలోని ఉండ్రుగొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయ తూర్పు గుట్టకు సమీపంలోని పెద్దగట్టుపై గురువారం మధ్యాహ్నం సుమారు రెండు గంటల నుంచి దట్టమైన పొగలు వ్యాప్తి చెంది మంటలుగా మారాయి. అధికారులకు గ్రామస్తులు సమాచారం అందించడంతో అటవీశాఖ, అగ్నిమాపక శాఖ అధికారులు గుట్ట ప్రాంతానికి చేరుకున్నారు. కాగా, అగ్నిమాపక వాహనంతో మంటలు అదుపు చేయడానికి గుట్ట ప్రాంతానికి చేరుకున్నప్పటికీ ఏం చేయలేని పరిస్థితి ఉండడంతో వెనుదిరిగామని ఫారెస్ట్ రేంజ్ అధికారి కిరణ్‌కుమార్, సెక్షన్ అధికారి వెంకటేశ్ తెలిపారు. మంటలు ఆరిన తర్వాత ఈ ఘటనకు గల కారణాలు గుర్తిస్తామని తెలిపారు. మంటల వ్యాప్తి అధికం కావడంతో సమీప గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కాగా, రాలిన చెట్ల ఆకులపై ఎవరైనా పశువుల కాపరులు బీడీ లేదా చుట్ట తాగి పడేయడంతో మంటలు వ్యాప్తి చెంది ఉంటాయని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

## పరీక్షల భయంతో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

నవ్య(ఫైల్)

కోదాడ రూరల్, మార్చి 6 : పరీక్షల భయంతో సూర్యాపేట జిల్లాలో ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. కోదాడ మండలం కోమరబండ గ్రామానికి చెందిన బచ్చలకూరి శంకర్, ఉమ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పెద్ద కూతురు బచ్చలకూరి నవ్య(16) సూర్యాపేట పరిధిలోని అనాజీపురం మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్నది. కొద్దిరోజుల క్రితం టైఫాయిడ్ జ్వరం రావడంతో ఇంటి వద్ద ఉండి వైద్యం చేయించుకుంది. బుధవారం తెలుగు పరీక్ష బాగా రాయలేదంటూ తండ్రి వద్ద నవ్య వాపోగా, పర్వాలేదు.. మిగతావి బాగా రాయమని ధైర్యం చెప్పాడు. పరీక్షలు రాసేందుకు హాస్టల్ వెళ్తానని తల్లిదండ్రులకు చెప్పిన నవ్య గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. శంకర్ ఫిర్యాదు మేరకు కోదాడ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# దివ్యాంగులకు యూడీఐడీ కార్డులు

- జనరల్ ఆసుపత్రిలో అందించేందుకు ఏర్పాట్లు చేయాలి
- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

గరిడేపల్లి: స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట, మార్చి 6: దివ్యాంగులకు యూడీఐడీ (యూనిక్ డిసెబిలిటీ ఐడీ) కార్డుల జారీ కోసం ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని వసతులతో కూడిన కార్యాలయం ఏర్పాటు చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. గురువారం సూర్యాపేట జనరల్ ఆసుపత్రిలోని సిబ్బందికి యూడీఐడీ పోర్టల్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 2025 మార్చి నెల నుంచి సదరం సర్టిఫికెట్ స్థానంలో 21 అంగవైకల్యాలకు సంబంధించి యూడీఐడీ కార్డు అందజేయనున్నట్లు వెల్లడించారు. ఇందుకు కావాల్సిన టెక్నికల్ సిబ్బందిని, మౌలిక వసతులను పది రోజుల్లో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం జనరల్ ఆసుపత్రిలోని అన్ని వార్డులను పరిశీలించి సేవలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఓపీ, ఐపీ, సిబ్బంది హాజరుకు సంబంధించిన రిజిస్టర్లు పరిశీలించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ సత్యనారాయణ, ఆర్ఎంఓ జనార్ధన్, డాక్టర్ సంధ్య, డాక్టర్ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

### నవోదయ విద్యాలయానికి స్థల పరిశీలన..

గరిడేపల్లి: మండలంలోని గడ్డిపల్లిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ ప్రాంతాన్ని, నవోదయ విద్యాలయం కోసం స్థలాన్ని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ రెవెన్యూ అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. 20 ఎకరాల్లో నూతనంగా నిర్మించ తలపెట్టిన రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి అనువైన పరిస్థితులు, అనుకూల వాతావరణం తదితర అంశాలపై టీడబ్ల్యూఐడీసీ ఇంజినీర్ రమేశ్‌ను సమగ్ర వివరాలతో నివేదిక పంపాలని ఆదేశించారు. నవోదయ విద్యాలయానికి కావాల్సిన 30 ఎకరాల స్థల సేకరణ పనులు జరుగుతున్నాయని, రెసిడెన్షియల్ స్కూల్ పనులు టెండర్ ప్రక్రియలో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. రెసిడెన్షియల్ స్కూల్‌కు గడ్డిపల్లి నుంచి పొలాల మధ్యలో ఉన్న రోడ్డును, అలాగే చిన్నగారకుంట తండా నుంచి ఉన్న రోడ్డును పరిశీలించారు. హుజూర్‌నగర్ ఆర్డీఓ వి.శ్రీనివాసులు, తాసీల్దార్ కవిత, సర్వేయర్ భాస్కర్, ఆర్ఐ రాంబాబు, అధికారులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులను పకడ్బందీగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ రాంబాబు

ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు

నడిగూడెం, మార్చి 6: ఉపాధి హామీ పనులను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. ఉపాధి హామీ పనుల్లో భాగంగా చేపడుతున్న బృందావనపురం-కలకోవ లింక్ రోడ్డు పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీల హాజరు వివరాలను పరిశీలించారు. అదేవిధంగా వేణుగోపాలపురంలో నిర్వహిస్తున్న నర్సరీని సందర్శించారు. నిర్దేశించిన లక్ష్యాల మేరకు ప్రతి నర్సరీలో మొక్కలు పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ సూర్యనారాయణ, ఎంపీడీఓ సంజీవయ్య, ఎంపీఓ విజయకుమారి, ఈసీ శ్రీను, టీఏ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

### దరఖాస్తులను పరిశీలించాలి

హుజూర్‌నగర్: ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. హుజూర్‌నగర్ మున్సిపాలిటీలో అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. అదేవిధంగా పన్నుల వసూలుపై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందిని ఆదేశించారు. అంతకుముందు పట్టణంలోని మైనార్టీ పాఠశాలను తనిఖీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రెహాన బేగం తదితరులు పాల్గొన్నారు.

## బాలికపై లైంగిక దాడి కేసులో 25 ఏండ్లు జైలు

సూర్యాపేట లీగల్, మార్చి 6: బాలికపై లైంగిక దాడి కేసులో దోషికి 25 ఏండ్లు జైలు శిక్ష విధిస్తూ సూర్యాపేటలో గల చిన్న పిల్లలపై అత్యాచార నిరోధక న్యాయస్థానం న్యాయమూర్తి డాక్టర్ శ్యామ్‌శ్రీ గురువారం తీర్పు వెలువరించారు. కేసు వివరాలిలా ఉన్నాయి.. ఆత్మకూర్.ఎస్ మండలం పాతర్లపహాడ్ గ్రామానికి చెందిన గుంజ వెంకన్న(40)పై అదే గ్రామానికి చెందిన ఓ బాలిక(16)పై పలుమార్లు లైంగిక దాడి చేశాడు. ఈ క్రమంలోనే బాలిక గర్భం దాల్చడంతో బలవంతంగా గర్భస్రావం చేయించాడు. బాలికకు రక్తస్రావం జరుగుతుండగా గమనించిన తల్లి విషయం తెలుసుకుంది. దీంతో 2001 ఏప్రిల్ 2న ఆత్మకూర్.ఎస్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి అప్పటి డీఎస్పీ మోహన్‌కుమార్ అభియోగపత్రం దాఖలు చేశారు. తాజాగా ఈ కేసులో విచారణ జరిపి 12 మంది సాక్షులను విచారించిన న్యాయస్థానం వెంకన్నను దోషిగా నిర్ధారించింది. లైంగిక దాడితో పాటు గర్భస్రావం చేయించినందుకు 25 ఏళ్ల జైలు, రూ.30 వేల జరిమాన విధిస్తూ న్యాయమూర్తి శ్యామ్‌శ్రీ తీర్పు వెలువరించారు.

## వరిలో అగ్గి తెగులు నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

- జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్‌రెడ్డి

అర్వపల్లిలో పొలాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్‌రెడ్డి

అర్వపల్లి, మార్చి 6: వరిలో అగ్గి తెగులు నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్ రెడ్డి సూచించారు. గురువారం అర్వపల్లి మండల కేంద్రంలో వరి పొలాలను మండల వ్యవసాయ అధికారి గణేశ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరిలో ఇటీవల అగ్గి తెగులు, కాండం తొలుచు పురుగులను గుర్తించామని తెలిపారు. దీనికి రైతులు తక్షణమే నివారణ చర్యలు పాటించాలని, లేనట్లయితే అధిక స్థాయిలో నష్టం వాటిల్లి దిగుబడి చాలా వరకు తగ్గే ప్రమాదం ఉందని అన్నారు. గత వారం రోజుల నుంచి రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గి చలి పెరగడం వలన అగ్గి తెగులు వృద్ధి ఎక్కువవుతుందని పేర్కొన్నారు. మొదటి దశలోనే అగ్గి తెగులును గుర్తించి ట్రైప్లోక్సీ ట్రోబిన్, టేబ్యు కొనజోల్ లేదా ట్రై సైక్లోజోల్ మందులను పిచికారీ చేయాలని, కాండం తొలుచు పురుగు నివారణకు కార్టెఫైడ్రాక్లైడ్‌ను పిచికారీ చేయాలని వెల్లడించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి శోభారాణి, రైతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలి : డీఈఓ

మునగాల, మార్చి 6: ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని డీఈఓ అశోక్ అన్నారు. గురువారం మండల కేంద్రంతో పాటు ముకుందాపురం ప్రభుత్వ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే బాగా చదవాలని సూచించారు. పాఠశాలలో విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలని, ఉపాధ్యాయులు ఇంటింటి సర్వే చేసి విద్యార్థుల సంఖ్యను పెంచాలని అన్నారు.

## మహిళలపై దాడులకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలి

- మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు సృజన

మేళ్లచెర్వు: జెండా ఎగురవేస్తున్న మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు సృజన

మేళ్లచెర్వు, మార్చి 6: భారత జాతీయ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తేల సృజన మహిళా సమాఖ్య జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సమాజంలో రోజురోజుకూ మహిళలపై దాడులు పెరిగిపోతున్నాయని, వాటిని అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. నిందితులకు కఠిన శిక్షలు అమలు చేయాలని కోరారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోటమ్మ, మల్లేశ్వరి, మహిళా కాంగ్రెస్ నాయకురాలు లక్ష్మి, కాని స్టేబుల్ కృష్ణవేణి పాల్గొన్నారు.

### 33 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి..

కోదాడ రూరల్: మహిళలకు తక్షణమే 33 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు దేవర మల్లేశ్వరి అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా కోదాడలోని భూపేష్ భవన్‌లో నిర్వహించిన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. అత్యాచారాలకు గురైన మహిళలకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా సత్వర న్యాయం అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోదాడ మండల కార్యదర్శి సట్టు అంజమ్మ, సట్టు పార్వతి, అనసూయ, అచ్చమ్మ, లక్ష్మి, సంధ్య, ఎస్‌కే.రహీమ, బుల్లెమ్మ, సవేర, రజని తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ దుకాణాల్లో తనిఖీలు

మేళ్లచెర్వు, మార్చి 6: మండల కేంద్రంతో పాటు కందిబండ, రేవూరు గ్రామాల్లోని పలు రేషన్ దుకాణాల్లో స్టేట్ టాస్క్‌ఫోర్స్ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించినట్లు సమాచారం. దుకాణాల్లోని రిజిస్టర్లను పరిశీలించి బియ్యం నిల్వలను తనిఖీ చేసినట్లు తెలిసింది.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గరిడేపల్లి, మార్చి 6: బైక్ అదుపుతప్పి కిందపడడంతో ఓ వ్యక్తికి గాయాలైన ఘటన మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన ఎల్.వెంకటమల్లయ్య గరిడేపల్లి నుంచి కల్మల్‌చెర్వు వైపు వెళ్తుండగా మండల కేంద్రంలోని సునంద రైస్ మిల్ క్రాస్‌రోడ్డు వద్ద బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. ప్రమాదంలో ఆయనకు స్వల్ప గాయాలు కాగా, స్థానికుల సాయంతో 108 అంబులెన్స్‌లో హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## లోక్ అదాలత్ సభ్యుల నియామకం

హుజూర్‌నగర్, మార్చి 6: హుజూర్‌నగర్ కోర్టులో ఈ నెల 8న నిర్వహించనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌కు సభ్యులను నియమిస్తూ రెండో అదనపు న్యాయమూర్తి శ్యామ్‌శ్రీ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రిసైడింగ్ అధికారిగా జిల్లా అదనపు న్యాయమూర్తి శ్యామ్‌శ్రీ, సభ్యులుగా చక్రాల వెంకటేశ్వర్లు, షేక్ సైదా, హుస్సేన్‌ను నియమించారు. అదేవిధంగా సీనియర్ సివిల్ జడ్జి కోర్టు బెంచ్‌కు ప్రిసైడింగ్ అధికారిగా సీనియర్ సివిల్ జడ్జి శ్యామ్‌కుమార్, సభ్యులుగా కాల్వ శ్రీనివాసరావు, యాదగిరి, జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బెంచ్‌కు ప్రిసైడింగ్ అధికారిగా జూనియర్ సివిల్ జడ్జి భవ్యశ్రీ, సభ్యులుగా బాలకృష్ణ, నాగార్జునను నియమించారు.

## రెండు నియోజకవర్గాలకు నిధులు మంజూరు

హుజూర్‌నగర్/కోదాడ, మార్చి 6: హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాలకు రూ.49.59 కోట్లు మంజూరైనట్లు గురువారం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కార్యాలయం నుంచి ఒక ప్రకటనను విడుదల చేశారు. ఈ నిధులతో రెండు నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులను చేపట్టనున్నారు.

## ఆర్థిక సాయం

కోదాడ రూరల్, మార్చి 6: ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన కోదాడకు చెందిన జర్నలిస్ట్ రఘు కుటుంబానికి గురువారం ఐజేయూ జిల్లా అధ్యక్షుడు గింజల అప్పిరెడ్డి ఆధ్వర్యంలో ఆ సంఘం ద్వారా సేకరించిన రూ.20 వేలను అందజేశారు. కార్యక్రమంలో సలిగంటి మురళి, ఆవుల మల్లికార్జున్, పల్లపు శ్రీనివాస్, దామోదర్, వెలిశాల శ్రీనివాస్, అజయ్, కరుణాకర్, రమేశ్ పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఆత్మకూర్.ఎస్, మార్చి 6: అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. మండలంలోని మక్తాకొత్తగూడెం గ్రామానికి చెందిన బోయిని గణేశ్, గుండాల గణేశ్, గుండాల రాకేశ్‌కు చెందిన ట్రాక్టర్లతో పాటు తాళ్లసింగారం గ్రామానికి చెందిన జటంగి సోనయ్యకు సంబంధించి రెండు ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిస్తుండగా కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

## ఎల్ఆర్ఎస్‌పై రాయితీ

తిరుమలగిరి, మార్చి 6: గతంలో ఎల్ఆర్ఎస్ పథకం కింద రూ.1,000 చెల్లించిన వారు 25 శాతం రాయితీతో ఎల్ఆర్ఎస్ రుసుం చెల్లించి ప్లాట్లను రెగ్యులరైజేషన్ చేయించుకునేందుకు అవకాశం కల్పిస్తున్నామని తిరుమలగిరి మున్సిపల్ కమిషనర్ యాదగిరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశం మార్చి 31 వరకు ఉంటుందని, మున్సిపాలిటీ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## డాగ్స్ షెల్టర్ గదులను ప్రారంభించిన ఎస్పీ

గదులను ప్రారంభిస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

సూర్యాపేట టౌన్, మార్చి 6: జిల్లా పోలీస్ శాఖకు కొత్తగా ట్రాక్టర్ లూసీ, ఎక్స్‌ప్లోజివ్ బ్రూనో అనే రెండు డాగ్స్(జాగిలాలు)ను కేటాయించగా, వాటి కోసం పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో నిర్మించిన షెల్టర్ గదులను ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీస్ శాఖలో కేసుల ఛేదనలో డాగ్స్‌కు ప్రత్యేక స్థానం ఉందని తెలిపారు. చాలా కేసుల్లో నేరస్థులను పసిగట్టడంలో సమర్థవంతంగా పని చేశాయని గుర్తు చేశారు. లూసీ ఘటనా స్థలంలో లభించే ఆధారాలతో నేరస్తులను గుర్తిస్తుందని, బ్రూనో పేలుడు సామాగ్రిని గుర్తిస్తుందని తెలిపారు. అదనపు ఎస్పీలు నాగేశ్వర్‌రావు, జనార్ధన్‌రెడ్డి, ఏఆర్ డీఎస్పీ నరసింహాచారి, ఆర్ఐలు నారాయణరాజు, నరసింహ, డాగ్ స్క్వాడ్ ఆర్ఎస్ఐ రాజశేఖర్, ఆర్ఎస్ఐలు సురేశ్, కె.అశోక్, ఎం.అశోక్, రెహమాన్, మహేశ్ పాల్గొన్నారు.

## కాళేశ్వరం జలాలు అందించాలని కాల్వలో దిగి నిరసన

కాల్వలో దిగి నిరసన తెలుపుతున్న రైతులు

తుంగతుర్తి, మార్చి 6: ఎస్సారెస్పీ కాల్వల ద్వారా కాళేశ్వరం జలాలను అందజేసి తమ పంటలను కాపాడాలని కోరుతూ మండల కేంద్రంలోని ఎస్సారెస్పీ కాల్వలోకి దిగి పలువురు రైతులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రెండు పంటలకు పుష్కలంగా నీళ్లు వచ్చాయని, ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో నీటి కరువును చూస్తున్నామని వాపోయారు. సాగు నీరు లేక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమను ఎవరూ పట్టించుకోవడం లేదని, ఆత్మహత్య తప్ప మరో దారి కనిపించడం లేదని అన్నారు. లక్షల రూపాయలు అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టామని, ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి మిగిలిన పంటలకైనా నీరు అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. నిరసన వ్యక్తం చేసిన వారిలో రైతులు వీరబోయిన నాగయ్య, గుజ్జ చందర్ రావు, నాగరాజు తదితరులు ఉన్నారు.

## 'ఉపాధి హామీ పనులను వినియోగించుకోవాలి'

కూలీలతో మాట్లాడుతున్న పీడీ అప్పారావు

నడిగూడెం, మార్చి 6: మండల పరిధిలోని కేశవాపురం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను జిల్లా గ్రామీణాభివృద్ధి ప్రాజెక్ట్ డైరెక్టర్ అప్పారావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. చేసిన పనికి వేతనం అందుతుందా.. లేదా అని, పని ప్రదేశంలో మౌలిక వసతులు అందుతున్నాయా అని ఆరాదీశారు. ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దాసరి సంజీవయ్య, ఈసీ శ్రీను, ఉపాధి హామీ సిబ్బంది విజయ్, ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి అన్వర్, ఫీల్డ్ అసిస్టెంట్ అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.

## దోమల నియంత్రణకు చర్యలు చేపట్టాలి : సీపీఎం

సూర్యాపేట టౌన్, మార్చి 6: దోమల బారి నుంచి ప్రజల ఆరోగ్యాన్ని రక్షించాలని సీపీఎం సూర్యాపేట వన్‌